వైద్యం వికటించి బాలుడి మృతి

ప్రైవేట్ దవాఖానల ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన

ధరణి దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు

మృతి చెందిన తనీశ్

మహబూబాబాద్ రూరల్, జూలై 13: వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో శనివారం జరిగింది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. డోర్నకల్ మండలం బూర్గుపాడుకు చెందిన కొత్త రాంబాబు, ప్రియ కుమారుడు తనీష్ (13) 7వ తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా తనీష్‌కు హైడ్రోసిల్ (ఉరిబీజం) వచ్చిందని మందులు వాడుతున్నాడు. రెండు రోజులు క్రితం మహబూబాబాద్‌లోని సురక్ష హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించగా, ఆపరేషన్ చేయించాలని డాక్టర్లు సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వైద్యులు ఆపరేషన్ చేశారని, అనంతరం బాలుడిని చూసేందుకు వెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే డాక్టర్లకు సమాచారం ఇచ్చామని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం బాధితుడిని ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు పంపించారని వారు వివరించారు. అక్కడికి తీసుకెళ్లే సమయంలోనే తనీష్ మృతి చెందాడని తెలిపారు. వైద్యం అందించడంలో డాక్టర్లు నిర్లక్ష్యం చేశారని, మత్తు ఇంజక్షన్‌లో ఎక్కువ డోస్ ఇవ్వడంతో ఊపిరి ఆడలేదని పేర్కొన్నారు. ఆపరేషన్ ఫెయిల్ కావడంతోనే బాలుడి ప్రాణం పోయిందని ఆరోపించారు. మరో హాస్పిటల్‌కు తనీష్‌ను పంపుతున్నామని తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే 108 వాహనంలో తీసుకెళ్లారని తెలిపారు. వైద్యం కోసం మాత్రం రూ.80 వేలు ముందస్తుగా తీసుకున్నా సరైన చికిత్స అందించకపోవడంతోనే తనీష్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ సురక్ష, ధరణి హాస్పిటల్స్ ముందు ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

కేసముద్రం, జూలై 13: మండల పరిధి ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గంట వీరయ్య ఇంట్లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. వీరయ్య తన ఇంట్లోని ఒక గదిలో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో మరో గది నుంచి పొగలు రావడంతో గమనించి విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. గదిలోకి వెళ్లి చూడగా ఫ్రిజ్ కాలిపోగా, దానిపై ఉన్న సూట్‌కేస్‌లోని రూ. 25 వేల నగదు, బ్యాంక్ పాస్ పుస్తకాలు, పక్కను దుస్తులు దగ్ధమయ్యాయని తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో సుమారు రూ.50వేల నష్టం జరిగిందని వీరయ్య పేర్కొన్నాడు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింద షెడ్యూలు హామీన్ స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **వాంకుడోత్ ఈశ**, S/o : **రాములు**, **వయస్సు** : 44 సం॥లు, **వృత్తి** : వ్యవసాయ కూలి, **నివాసం** : ఇ.నెం. 2-1-3, సోమ్లతండ, డోర్నకల్, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : పురపాలక సంఘం డోర్నకల్, రెవిన్యూ మండలం మరియు మండల పరిషత్తు డోర్నకల్, రెవిన్యూ జిల్లా : మహబూబాబాద్, రిజిస్ట్రేషన్ జిల్లా : వరంగల్, సబ్ రిజిష్టార్ మహబూబాబాద్ వారి పరిధిలో గల డోర్నకల్ పట్టణములోని మున్సిపల్ డోర్ నెం. 2-1-3 గల ఆర్.సి.సి. & రేకుల కప్పు గృహము నిర్మిత విస్తీర్ణం :ఆర్.సి.సి. 241 చ॥ఫీట్లు, రేకుల కప్పు :174.20 చ॥ఫీట్లు, గృహముతో సహా మొత్తం స్థలము విస్తీర్ణం :75.63 చ॥గ॥లు, సమము :63.23 చ॥మీ॥, ఇట్టి గృహములో కరెంటు మీటరు కలదు, **డాక్యుమెంట్ నెం. 15367/2023** గల ఆస్తికి హద్దులు : **తూర్పు**: మున్సిపల్ రోడ్డు, **పడమర** : వాంకుడోతు నందా గృహము, **ఉత్తరం** : వాంకుడోతు సంతు గృహము, **దక్షిణం** : వాంకుడోతు బాల్య స్థలము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కురవి, జూలై 13: నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం పదహారు చింతలతండాలో లంబాడా గిరిజన దంపతులైన బానోత్ సుగుణ, శ్రీనును హత్య చేసిన మేకల నాగరాజు(బన్నీ)పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎం కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాగరాజును కఠినంగా శిక్షిస్తేనే మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా గిరిజనులపై దాడులు పెరిగాయని, పోలీసులు వెంటనే స్పందించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నా నాయక్, ఆంజనేయులు, శత్రు, హరియా పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

- పోలీసులు ప్రజల మన్ననలు పొందాలి
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్


గూడూరు: పాపారావు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, పోలీసు అధికారులు

మహబూబాబాద్, జూలై 13: చట్ట పరిధిలోని ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్సైలు ఫంక్షనల్ వర్టికల్స్‌పై సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి వారి మన్ననలు పొంది, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా వర్టికల్స్‌లో సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన పొంది, ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. 100 డయల్ ఫిర్యాదులపై స్థానిక పోలీసులు వెంటనే స్పందించి అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేసినప్పుడే వారిలో పోలీసులపై పూర్తి నమ్మకం, విశ్వాసం కలుగుతుందన్నారు. నిత్యం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, గస్తీ, పెట్రోలింగ్ సహా రూట్ వాచ్‌లు నిర్వహించి అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. నిత్యం ప్రజల శాంతిభద్రతల విషయంలో పోలీసులు నిఘా పెట్టి అప్రమత్తంగా పని చేయాలన్నిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పించి ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి, గుడుంబాతో ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని సూచించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

గూడూరు: ఇటీవల లారీ ప్రమాదంలో మృతి చెందిన గూడూరు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ధనసరి పాపారావు కుటుంబానికి పోలీసులు ఆర్థిక చేయూత అందజేశారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సహోద్యోగులు తమ వంత సహాయంగా రూ.2.10లక్షలు సేకరించగా, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సమక్షంలో డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బాబారావుతో కలిసి పాపారావు కుటుంబానికి శనివారం ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్సైలు నగేశ్, దిలీప్, రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, జూలై 13: నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. నియోజకవర్గ పరిధిలోని 185 మంది బాధితులకు రూ.49.04లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలను ఆదుకొనేందుకు సీఎం సీఎంఆర్ఎఫ్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సీఎంఆర్ఎఫ్ మంజూరు చేసిన సీఎం, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్‌చైర్మన్ సురేందర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు హమ్యానాయక్, రాపాక సత్యనారాయణ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సోమా రాజశేఖర్, సుంచు సంతోష్, రవీందర్‌రెడ్డి, సురేశ్‌నాయక్, గిరగాని కుమారస్వామి, ముద్దసాని సురేశ్, నల్ల శ్రీరామ్, వార్డు కౌన్సిలర్లు, తాజా, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

గొర్రెలకు వ్యాధి నివారణా టీకాలు

ఇనుగుర్తి, జూలై 13: వర్షాకాలంలో గొర్రెలకు సోకే బ్లూటంగ్ వ్యాధి నివారణకు పశువైద్యాధికారి రాజేశ్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని చిన్ననాగారం గ్రామంలో డాక్టర్ మౌనిక టీకాలు వేశారు. ఇవి పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నదని, గొర్రెల కాపరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయిని మల్లయ్య, బత్తిపట్ల యాకయ్య, కుంబం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎంపీ రవిచంద్ర

గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి
రూ.5 లక్షలు మంజూరు

కేసముద్రం, జూలై 13: మండల పరిధి ఇంటికన్నే గ్రామంలోని గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.5లక్షలు మంజూరు చేసినట్లు గౌడ కుల సంఘం బాధ్యులు గంధసిరి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఎంపీ రవిచంద్రను హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా, వెంటనే స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు గౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కారుపోతుల యాకయ్య, ముంజ కుమారస్వామి, చిర్ర శ్రీధర్, నలమాస సందీప్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కేసముద్రం, జూలై 13: మండలంలోని రంగాపురం శివారులో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన లకావత్ రెడ్యా ఆవు శుక్రవారం మేతకు వెళ్లింది. సాయంత్రం ఆవు తిరిగి రాక పోవడంతో అడవికి వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉన్నది. సుమారు రూ.40వేల నష్టం జరిగిందని బాధిత రైతు రెడ్యా తెలిపాడు.

సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో 'గ్రీన్ డే'..

డోర్నకల్, జూలై 13: మున్సిపాలిటీ పరిధి రాజుతండాలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో శనివారం గ్రీన్‌డే నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించి, నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హలీమ, వసంత, భారతి, మౌనిక, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రన్ హుస్సేన్ పగటి సవారి పండుగ

యూసుఫ్

మహబూబాబాద్ రూరల్, జూలై 13: మండల శివారు బేతోలు గ్రామంలో నేడు (ఆదివారం) రన్ హుస్సేన్ పగటి సవారి పండుగ నిర్వహించనున్నట్ల ముస్లిం మత పెద్ద షేక్ యూసుఫ్ తెలిపారు. పీరీల గుండం వద్ద భక్తులు తయారు చేసిన పాల మటికలతో పూజలు పాతి హాలు ఇచ్చి పానకం పంచి పెడుతారని, హిందూ, ముస్లింలు పెద్దఎత్తున రంగుల దట్టీలు, కుడుకలు బెల్లంతో తయారు చేసిన బాసింగాలు, వెండీ, బంగారంతో తొట్టెలు చేసి భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లిస్తారన్నారు. ఈ పండుగలో ఇమామ్ హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటామన్నారు. పండుగను బేతోలులో ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా బైస స్వామి

బైస స్వామి

నెల్లికుదురు, జూలై13: మండలంలోని ముని గలవీడు గ్రామానికి చెందిన బైస స్వామిని సీపీఐ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బీ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వామిని మండల కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా తూటి వెంకటేర్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి, నియోజకవర్గ కార్యదర్శి అజయ్ సారథికి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డోర్నకల్, జూలై 13: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన రావిగూడెంలో జరిగింది. ఏఎస్సై నాగేశ్వరరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం వెంకన్న (55) గతేడాది సైకిల్‌పై నుంచి కింద పడగా కాలుకు తీవ్ర గాయాలై, శస్త్ర చికిత్స జరిగింది. అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 11న ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'సీడాట్' శాస్త్రవేత్త-డీగా మోహన్

మోహన్

కేసముద్రం, జూలై 13: భారత ప్రభుత్వ సంస్థ అయిన సీడాట్ కంపెనీ శాస్త్రవేత్త డీగా తనను గుర్తించినట్లు మండలంలోని మహిమూద్‌పట్నం శివారు తౌర్యతండాకు చెందిన మూడావత్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి 2012 నుంచి సీడాట్ సంస్థలో ఉద్యోగం పొందానని, 4జీ, 5జీ టెక్నాలజీ లోపని చేస్తున్న క్రమంలో సంస్థ తన ప్రతిభను గుర్తించి శాస్త్రవేత్త -డీగా గుర్తించినట్లు పేర్కొన్నాడు. మారుమూల ప్రాంతంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మోహన్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి వాస్త్రవేత్త -డీగా గుర్తింపు పొందడంపై తండావాసులు మోహన్‌ను అభినందించారు.

మృతురాలి కుటుంబానికి రెడ్యా పరామర్శ

దంతాలపల్లి, జూలై 13: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన అది బక్కమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, శనివారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకన్న ఉన్నారు.

బక్కమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యానాయక్

'ఆయిల్‌పామ్'తో అధిక దిగుబడి

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మరియన్న

డోర్నకల్, జూలై 13: ఆయిల్‌పామ్ తోటలతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మరియన్న అన్నారు. శనివారం మండలంలోని ఉయ్యాలవాడ, వెన్నారం గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటలు, నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ పంటతో ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం ఆయిల్‌పామ్ తోటలకు డ్రిప్ సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని, పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, నారు అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు పాటించని నర్సరీ యజమానులపై పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వెన్నారం నర్సరీలో విత్తనాల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న మరియన్న

ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళా

జిల్లావ్యాప్తంగా ఈ నెల 14న నుంచి సెప్టెంబర్ 30 వరకు మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మరియన్న తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ తోటలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా ప్లాంటేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నీటి వసతి ఉన్న ప్రతి రైతు పంట మార్పిడితో ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి, ఎకరానికి నికరాదాయం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారిణి అనితశ్రీ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం వీరయ్య, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్, జూలై 13: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఈదులపూసపల్లి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ పూజారి వీరయ్య అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లి ఎంపీఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీ అయిన ఎండీ రఫీ పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు, కిరణ్‌కుమార్, లావణ్య రూ.10 వేలు, హేమన్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ రూ.2వేలను బ్లాక్ బోర్డులు, మైక్ మౌత్ పీస్‌లకు అందజేశారు. వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, సూర్య, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకరణలో వాసవీమాత

తొర్రూరు, జూలై 13: మున్సిపల్ కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారికి శాకాంబరీ అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చలువాది సత్యనారాయణ ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్, వాసవీక్లబ్ కేసీజీఎఫ్ సిల్వర్ స్టార్ అన్నపూర్ణ అధ్యక్షుడు మచ్చ సురేశ్ ఆర్థిక సహకారంతో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరించి పూజలు, ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు గోత్రనామార్చనతో అమ్మవారికి పూజలు చేయించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అనిల్, కమిటీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, వాసవి సిల్వర్‌స్టార్ అన్నపూర్ణ క్లబ్ కోశాధికారి శ్రీనివాస్, శివాజీ యూత్ ప్రధాన కార్యదర్శి నిఖిల్, ఇమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

పెద్దవంగర: గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కరూ రక్షించాలని, పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీవో బీ వేణుమాధవ్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరగూడెం, పెద్దవంగర గ్రామాల్లో మొక్కలు నాటే విధానం, మురుగునీటి కాల్వలు, పారిశుధ్యాన్ని ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వెంకన్న, టీఏ యాకన్న, సురేశ్, నాయకులు మురళి, లింగమూర్తి ఉన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు చర్చి కాంపౌండ్‌లో కౌన్సిలర్ బాసిక అశోక్ శనివారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, వార్డు అఫీసర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లికుదురు, జూలై 13: మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన నిరుపేద మాతంగి యాకమ్మ కుటుంబానికి శనివారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు హరీశ్, అశోక్, వేణు, విష్ణు, అంజి, ప్రశాంత్, సన్నీ, శ్రీలత, చిరంజీవి, సాయి, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు

స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ఉపేందర్‌రావు,ఎస్సై తిరుపతి

డోర్నకల్, జూలై 13: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని శనివారం డోర్నకల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకా రం.. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను, చొప్పరి నాగరాజు హమాలీ పని చేస్తూ జల్సాలకు డబ్బుల కోసం బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. ఈనెల 7న సాయంత్రం కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బద్దల వీరయ్య డోర్నకల్ నుంచి వరంగల్‌కు వెళ్లేందుకు టీవీఎస్ (ఎక్స్‌ఎల్)ను పాత పోలీస్ స్టేషన్ వద్ద పార్కు చేసి టీ తాగడానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. వీరయ్య ఫిర్యాదు మేరకు డోర్నకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం పట్టణ శివారులోని ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద చెట్ల పొదల్లో దాచి ఉంచిన (టీవీఎస్ ఎక్స్‌ఎల్)ను దొంగలు తీస్తున్న క్రమంలో పెట్రోలింగ్ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని ధరావత్ శ్రీను, నాగరాజును అరెస్టు చేసి, మహబూబాబాద్ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. ఎస్సై తిరుపతి, ఏఎస్సై కోటేశ్వరరావు, కానిస్టేబుల్ సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

తొర్రూరు, జూలై 13: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ కే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి పుట్టినరోజు, తొర్రూరులోని వేంకటేశ్వరాలయం ప్రాంగణంలో డాక్టర్ రాజేందర్‌రెడ్డి, మచ్చ సురేశ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేశ్-సుచరిత ఆర్థిక సాయంతో ప్రసాద వితరణ, వందేమాతరం ఫౌండేషన్‌లోని విద్యార్థులకు రూ.7వేల విలువ చేసే నిత్యావసర సరుకులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. వలస కూలీలకు రూ.2వేల విలువైన చీరలు అందజేశారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ రేగూరి శ్రీదేవి, క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్, కార్యదర్శి తమ్మి రమేశ్, కోశాధికారి బోనగిరి శంకర్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రేగూరి వెంకన్న, గీతా, నాళ్ల కృష్ణమూర్తి, అనసూర్య, చలువాది సత్యనారాయణ, ఇమ్మడి రాంబాబు, నాళ్ల శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

అవసరార్థులకు ఆసరగా లయన్స్ సేవలు

అవసరార్థులకు ఆసరగా లయన్స్ సేవలు అందిస్తున్నదని లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ